గంగపుత్రులకు జీవన భరోసా

వైఎస్సార్ మత్స్యకార భరోసా

సంవత్సరం	లబ్ధిదారులు	పొందిన లబ్ధి
2019-20	27	2,70,000
2020-21	886	88,60,000
2021-22	680	68,20,000
2022-23	470	4,70,000

నాలుగు విడతల్లో లబ్ధిదారులకు జమ అయిన నగదు: 1,64,20,000

- వేట నిషేధ సమయాల్లో భృతి
- డీజిల్‌పై సబ్సిడీ పెంపు
- మృతుల కుటుంబాలకు పరిహారం రెట్టింపు
- నాలుగేళ్లలో నియోజకవర్గంలో రూ.1.64 కోట్లు చెల్లింపు


తీరంలో నిలిపి ఉంచిన బోట్లు

గాజువాక : నడిసంద్రంలో బతుకు పోరాటం చేసే గంగపుత్రులకు వేట నిషేధ సమయంలో అండగా నిలిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక పథకం వైఎస్సార్ మత్స్యకార భరోసా. 21 నుంచి 60 ఏళ్ల లోపు వయసు గల మత్స్యకారులు ఈ పథకం కింద ఏటా రూ.10 వేల చొప్పున ప్రభుత్వం నుంచి ఆర్థిక ప్రయోజనం పొందుతున్నారు. సముద్రంతో పాటు వివిధ నీటి వనరులలో చేపలు పట్టేవారికి ఈ పథకం కింద ప్రభుత్వ సాయం అందుతోంది. వేట సమయంలో ప్రమాదవశాత్తు మరణం, శాశ్వత వైకల్యం సంభవిస్తే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం చెల్లిస్తోంది. బాధిత కుటుంబాల జీవనోపాధి కోసం సహాయం అందించడంతో పాటు వారికి సామాజిక భద్రత కూడా కల్పిస్తోంది. సముద్రంపై వేటకు వెళ్లే మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో ఈ పథకం కింద ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున నిషేధ భృతిని అందిస్తోంది.

గత ప్రభుత్వం కంటే మిన్నగా..

గత టీడీపీ ప్రభుత్వం తొలి రెండేళ్లలో రూ.2 వేల చొప్పున భృతి ఇవ్వగా, ఆ తరువాత రూ.4 వేల చొప్పున ఇచ్చారు. అది కూడా మర, యాంత్రిక పడవలకే పరిమితం చేశారు. కానీ, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టినప్పటి నుంచి ఈ భృతిని రూ.10 వేలకు పెంచడమే కాక.. మర యాంత్రిక పడవలతో పాటు సంప్రదాయ పడవలపై వేట జరిపే మత్స్యకార కుటుంబాలకు కూడా భృతిని చెల్లిస్తోంది. గతంలో పోలిస్తే మొత్తం లబ్ధి ఆరు రెట్లు అధికమని చెప్పొచ్చు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సరైన సమయానికి, వేట నిషేధ కాలంలోనే భృతిని చెల్లిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు.

డీజిల్ సబ్సిడీలోను టీడీపీ ప్రభుత్వం కంటే మిన్నగా మత్స్యకారులకు లబ్ధి చేకూర్చింది. గత ప్రభుత్వం లీటర్ డీజిల్‌కు రూ.6 చొప్పున ఆయిల్ సబ్సిడీ చెల్లించేది. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ సబ్సిడీని రూ.9కి పెంచడమే కాక, మత్స్యకారులకు స్మార్ట్ కార్డులను మంజూరు చేశారు. వీటిద్వారా సబ్సిడీ మొత్తాన్ని మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని డీజిల్‌కు చెల్లించే వెసులుబాటు కల్పించారు.



పరిహారం పెంపు

వేట చేస్తూ మరణించిన మత్స్యకారుని కుటుంబానికి గతంలో రూ.5 లక్షల పరిహారం ఇస్తే ఆ మొత్తాన్ని వైఎస్సార్ ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచింది. కుటుంబ పెద్ద, సంపాదిస్తున్న సభ్యుడు ప్రమాదవశాత్తు మరణించిన సందర్భంలో బాధిత కుటుంబాలు తమ జీవనోపాధి కోసం ఇబ్బంది పడుతుంటాయి. ప్రమాదవశాత్తు మరణాలు, శాశ్వత వైకల్యాల సంఘటనల సమయంలో బాధిత కుటుంబాల జీవనోపాధికి ఎక్స్‌గ్రేషియాతో సహాయం చేయడం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ఉద్దేశం. నాలుగేళ్లలో గాజువాక ప్రాంత మత్స్యకారులకు ప్రభుత్వం రూ.1.64 కోట్ల ఆర్థిక సాయం అందించింది.

సీఎం జగన్ అండగా నిలిచారు



సముద్రంలో చేపలవేట మాకు తరతరాలుగా వస్తున్న వృత్తి. మాకు ఇది తప్ప వేరే పని తెలియదు. అందుకే ప్రాణాలతో చెలగాటమైనా నడి సముద్రంలో వేటకు వెళ్లి వస్తాం. మాలాంటివారికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. సంవత్సరానికి మాకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇప్పటివరకు నేను నాలుగుసార్లు ప్రభుత్వ సాయం పొందాను. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

– కదిరి సత్యానందం, మత్స్యకారుడు

ప్రభుత్వ సాయం బాగా పెరిగింది



గత ప్రభుత్వం వేట నిషేధ సమయంలో మాకు కంటి తుడుపుగా ఆర్థిక సహాయం అందించేది. కేవలం రూ.2 వేలు, రూ.4 వేలు ఇచ్చి చేతులు దులుపుకొనేవారు. అవి కూడా సమయానికి వచ్చేవి కాదు. ఈ విషయంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చొరవ వల్లనే మాకు సకాలంలో సాయం అందుతోంది. అది కూడా బాగా పెరిగింది. సంవత్సరానికి రూ.10వేల చొప్పున నాకు ఇప్పటివరకు నాలుగుసార్లు అందింది. ఈ సాయం కూడా వేట నిషేధ సమయానికి అందిస్తున్నారు. ఇది మాకు చాలా ఉపయోగకరంగా ఉంది.

– కదిరి పోలరాజు, మత్స్యకారుడు

మా కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి



మత్స్యకారుల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. గతంలో వేట నిషేధ భృతి నామమాత్రంగా ఉండేది. మే నెలలో దరఖాస్తు చేస్తే నవంబర్ నెలలో ఇచ్చేవారు. అవి కూడా కొందరికే వచ్చేవి. కానీ జగనన్న మాత్రం మత్స్యకారులను ఆదుకునేలా భరోసా కల్పించారు. సకాలంలో మాకు సాయం అందిస్తున్నారు. సంవత్సరానికి రూ.10వేలు చొప్పున నేరుగా అకౌంట్‌లో వేస్తున్నారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– కె. అప్పన్న, మత్స్యకారుడు

ప్రజల ఆశీస్సులతో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్


పైపులైను ప్రారంభోత్సవ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

- అదే అందరి ఆకాంక్ష
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 68వ వార్డులో లేక్ వ్యూ వాకింగ్ ట్రాక్, పైప్‌లైన్ ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ప్రజల ఆశీస్సులతో జగన్‌మోహన్ రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రి పదవిని చేపడతారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 175కు 175 అసెంబ్లీ స్థానాలు, మొత్తం 25 ఎంపీ స్థానాలను కైవశం చేసుకొని వైఎస్సార్ సీపీ చరిత్ర సృష్టించడం ఖాయమన్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో 1 కోటి 48 లక్షల రూపాయలతో నిర్మించిన అక్కిరెడ్డిపాలెం లేక్ వ్యూ వాకింగ్ ట్రాక్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. రూ.39.90 లక్షలతో నిర్మించిన పైపులైన్ నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిద్ధం సభలకు పోటెత్తుతున్న జనసునామీని చూసి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. గాజువాకలో 68వ వార్డులో పూర్తి స్థాయి నిధులతో పనులు చేపట్టిన ఘనత కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్‌లకు చెందుతుందన్నారు.


అక్కిరెడ్డిపాలెంలోని లేక్ వ్యూ వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

దమ్మున్న నాయకుడు సీఎం జగన్

కార్పొరేటర్ గుడివాడ అనూష మాట్లాడుతూ మన ప్రభుత్వంలో మీ ఇంట్లో మంచి జరిగితేనే మాకు ఓటు వేయండి అని చెప్పే దమ్మున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఇలా ఓటు అడిగిన నాయకుడు ఇప్పటి వరకు చరిత్రలోనే లేరన్నారు. ఎన్నికల తర్వాత చంద్రబాబు, పవన్ కల్యాణ్ హైదరాబాద్ పారిపోవడం ఖాయమన్నారు. అనంతరం అక్కిరెడ్డిపాలెం లేక్ వ్యూ వాకింగ్ ట్రాక్‌ను ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ అనూష, లతీష్ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, పోలవరపు శ్రీహరి, రెడ్డిపల్లి చిట్టిబాబు, నంబారు రాజు, ఆదిబాబు, తెంటు గోపాలరావు, సయ్యద్ హుస్సేన్, గుడివాడ ప్రసాద్, గొంతిన సత్యవతి, నేలపాటి సత్యవతి పాల్గొన్నారు.

ఘనంగా 'సిద్ధం' సంబరాలు

సభల విజయవంతంపై నాయకుల హర్షం

గాజువాక : ఎన్నికల నగారా మోగించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభలు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం కావడంతో వైఎస్సార్‌సీపీ గాజువాక నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ఆధ్వర్యంలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, సమన్వయకర్త ఉరుకూటి చందు సమక్షంలో కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చరిత్రలో ఏ పార్టీ నిర్వహించని విధంగా సిద్ధం సభలలో పది లక్షల మందికి పైగా ప్రజలు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఆరు వందల హామీలిచ్చి అమలు చేయని నాయకుడు చంద్రబాబు అని, తొమ్మిది హామీలిచ్చి అన్నింటినీ అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. చంద్రబాబు ఎలాంటి అనైతిక పొత్తులు పెట్టుకున్నా మళ్లీ వచ్చేది జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, నాయకులు పల్లా చినతల్లి, కోమటి శ్రీనివాసరావు, మొల్లి చిన్న, యువశ్రీ, రంబ నారాయణమూర్తి, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న నేతలు

15న ఉక్కు పరిరక్షణ బహిరంగ సభ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 15న నిర్వహించనున్న ఉక్కు పరిరక్షణ బహిరంగ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరు కానున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు మద్దతుగా త్రిష్ణ మైదానంలో ఆ రోజు సాయంత్రం 4 గంటలకు సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభకు మాజీ కేంద్ర మంత్రులు, మాజీ ఎంపీలు, ఏఐసీసీ, పీసీసీ నాయకులతో పాటు సీపీఎం, సీపీఐ నాయకులు హాజరవుతున్నారన్నారు. ఉక్కు నిర్వాసితులు, ఉద్యోగులు కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు. బహిరంగ సభ నేపథ్యంలో సోమవారం సాయంత్రం సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు త్రిష్ణ మైదానాన్ని సందర్శించారు. అక్కడ సభ ఏర్పాట్ల గురించి పోరాట కమిటీ నాయకులను అడిగి తెలుసుకున్నారు.


త్రిష్ణా మైదానాన్ని పరిశీలిస్తున్న సౌత్ ఏసీపీ త్రినాథ్, సీఐ శ్రీనివాసరావు

ఇంకుడు గుంతలతో నీటి కొరతకు చెక్

కూర్మన్నపాలెం: ప్రతీ ఒక్కరు ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం ద్వారా నీటి కొరతకు చెక్ చెప్పవచ్చని తిరుమలనగర్ సంక్షేమ సంఘం సభ్యులు పేర్కొన్నారు. బెంగళూర్ తదితర నగరాల్లో ప్రజలు నీటి సమస్యలను ఎదుర్కొంటున్న దృష్ట్యా సభ్యులు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుమల నగర్‌లోని వినయ్ టవర్స్–1 వాసులు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడంతో వారిని అభినందించారు. జలమే జీవనాధారం అంటూ అవగాహన కల్పించారు. ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీటిని ఒడిసిపడితే భావితరాలకు నీటి సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, అప్పలనాయుడు, ఈశ్వరరావు, ఉమామహేశ్వరరావు, శివప్రసాద్, వినయ్ టవర్స్–1 వాసులు పాల్గొన్నారు.


నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న తిరుమలనగర్ సంక్షేమ సంఘం సభ్యులు

మహిళా శక్తితోనే దేశం ముందడుగు

పరవాడ: మహిళలు వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్నారని విశాఖ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి.లాల్‌కృష్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాంకీ హబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎండీ లాల్‌కృష్ణ ప్రసంగించారు. మహిళా శక్తితోనే దేశం ముందడుగు వేస్తుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి.రామిరెడ్డి మాట్లాడుతూ మహిళలను మించిన ప్రేరణ శక్తి మరొకటి లేదన్నారు. కళా ఆస్పత్రి ఎండీ కళావతి మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న గౌతమి, ఎం.దుర్గామణి, బి.అనూష, మేరీ సువార్త, వెన్నల శశికళ, బి.శ్రీదేవి, రాజేశ్వరి, కె.సరస్వతి, పి.హైమావతి, వై.భాను, ఎం.వి.సునీత, సుజాతలతో పాటు రాంకీ సంస్థకు చెందిన 11 మంది ఉద్యోగులకు రాంకీ ఎంపవరింగ్ విమెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విశ్వనాథ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, ఫార్మాసిటీ ప్రతినిధులు ఎర్రయ్య, గిరిధర్‌భక్షి, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి, రాజేశ్వరి పాల్గొన్నారు.

వైభవంగా సాయినాథుని రథోత్సవం

పెదగంట్యాడ: సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామం 10వ వార్షికోత్సవం సందర్భంగా సాయినాథుని రథోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. బాబా ఉత్సవమూర్తిని రథంపై అధిష్ఠింపజేసి, ఆలయ కమిటీ ప్రతినిధులు రథోత్సవాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కోలాటం, కూచిపూడి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉదయం ఆంజనేయస్వామి హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ నెల 12న ఉత్సవాల ముగింపు సందర్భంగా 108 కలశాలతో బాబాకు మహా కుంభాభిషేకం, మధ్యాహ్నం 27 రకాల పండ్లు, 27 రకాల మిఠాయిలను నైవేద్యంగా సమర్పించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ నక్క లక్ష్మణరావు తెలిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని, సాయంత్రం పరస, పుష్పయాగం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ కొండా శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి సత్యనారాయణ, కమిటీ సభ్యులు రామకృష్ణ, వైవీ రమణ, సత్యంబాబు, బి.సత్యనారాయణ, సాయి సేవకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


సాయినాథుని రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీని గెలిపించాలి


చందును సత్కరిస్తున్న డెమోక్రటిక్ సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించేందుకు మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు కోరారు. డెమోక్రటిక్ సేవా సంఘం ఆధ్వర్యంలో దిబ్బపాలెంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో చందు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తనను గాజువాక సమన్వయకర్తగా నియమించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యలమంచిలి అప్పారావు, కృష్ణప్రసాద్, చిక్కాల సన్యాసిరావు, ఇల్లపు కొండలరావు, గొంతెన అప్పలరాజు, శనివాడ రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలి

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కార్మికుల ఉపాధికి భరోసా దక్కుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1124వ రోజు, సోమవారం సంస్థకు చెందిన బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్రప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్ ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగుతుందని ప్రకటించే వరకు తమ ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

అజాగ్రత్తగా డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు

ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్


హెవీ వాహనాల డ్రైవర్లు, యజమానులకు సూచనలిస్తున్న ఏసీపీ రాజీవ్‌కుమార్

సింహాచలం: అజాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జోన్–2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్ అన్నారు. అడవివరం నుంచి గోపాలపట్నం మార్గంలో ఇటీవల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారులు మృతి చెందడంతో హెవీ వెహికల్ డ్రైవర్లు, యజమానులకు సింహాచలంలోని ఒక కల్యాణమండపంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. నిర్ణీత సమయంలో మాత్రమే అడవివరం మార్గంలో హెవీ వెహికల్స్‌కి అనుమతి ఉంటుందని, ఆసమయాల్లోనే రాకపోకలు సాగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. తద్వారా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్టు అంచనా వేశామన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో పశ్చిమ ట్రాఫిక్ సీఐ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

గాజువాక : వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు కొసిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో 72వ వార్డు సంద్రానిపాలెంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి వంగవీటి రంగా అని పేర్కొన్నారు. పేదలకు ఆయన అందించిన సేవలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, బొడ్డ గోవింద్, రావాడ శివ, పల్లా చినతల్లి, బోగాది సన్ని, రోజారాణి, యువశ్రీ తదితరులు పాల్గొన్నారు.


రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

క్లుప్తంగా

పేదలకు వితరణ


పేదలకు సరకులు పంపిణీ చేస్తున్న ముత్యాలు

పెదగంట్యాడ: పవన్ సేవా ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ట్రస్ట్ చైర్మన్ జెర్రిపోతుల ముత్యాలు తెలిపారు. ముత్యాలు కుమారుడు పవన్ 11వ వర్ధంతి సందర్భంగా నడుపూరులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. జెర్రిపోతుల వెంకటలక్ష్మి, లంకా ప్రియాంక పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన


మాట్లాడుతున్న జెడ్సీ సన్యాసి నాయుడు

అగనంపూడి: ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని గాజువాక జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు సూచించారు. ఓటు హక్కు వినియోగంపై 85వ వార్డు గొన్నా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యం బలోపేతం కావడానికి ఓటు హక్కు ఒక సాధనమన్నారు. యువత బాధ్యతగా వ్యవహరించి ఓటును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గొన్నా కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎస్.ఎస్.మూర్తి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ.. ఒకరికి గాయాలు


గాయాలపాలైన గణేష్

అక్కిరెడ్డిపాలెం: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఒక యువకుడు గాయాలపాలయ్యారు. ఘటనకు సంబంధించి గాజువాక పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పైడిమాంబ కాలనీకి చెందిన గణేష్, అజీమాబాద్‌కు చెందిన అహ్మద్ స్నేహితులు. ఏ పనీ చేయకుండా తిరుగుతూ ఉండేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇద్దరూ కణితి రోడ్డులో మద్యం సేవించి, ఘర్షణకు దిగారు. ఆ క్రమంలోనే అజీమాబాద్ ఇంటికి చేరుకున్నారు. అహ్మద్ తల్లిని గణేష్ దూషించడంతో పాటు బెదిరించి, కణితి రోడ్డుకు చేరుకున్నాడు. తల్లిని తిట్టడంతో ఆగ్రహానికి గురైన అహ్మద్ కణితి రోడ్డులో గణేష్‌పై కత్తితో దాడికి తెగబడటంతో అతడికి తలపై, శరీరంపై గాయాలయ్యాయి. గణేష్ ఆ గాయాలతోనే రాత్రంతా రోడ్డు పక్కనే పడి ఉన్నాడు. సోమవారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు గణేష్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పుపై ఫిర్యాదు


జెడ్సీ సన్యాసిరావుకు సమస్యను వివరిస్తున్న సమైక్య ఫ్లాట్స్ యజమానులు

గాజువాక : ఆటోనగర్ డీ బ్లాక్‌లో డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పు పెడుతున్నారని తోకాడ గ్రామానికి చెందిన సమైక్య అపార్ట్‌మెంట్ నివాసులు ఫిర్యాదు చేశారు. దీనివల్ల వెలువడుతున్న పొగతో తమ ప్రాంత నివాసులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు సమైక్య అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ సన్యాసిరావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. పొగ కాలుష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో సమస్యలను జెడ్సీకి వివరించారు. వినతి పత్రం సమర్పించినవారిలో అసోసియేషన్ ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, ఎ.తవిటయ్య తదితరులున్నారు.